ప్రజాశక్తి
శుక్రవారం 10 ఫిబ్రవరి 2023



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: తాగునీటి సమస్యపై చింతపల్లి మండల కేంద్రంలోని ఆర్ డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్నం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మండల కేంద్రంలోని సాయి నగర్, మెట్ట బంగ్లా, ఐటిడిఏ క్వార్టర్స్, ప్రాంతాలకు గత కొన్ని నెలలుగా తాగునీరు సరఫరా చేయడం లేదని, దీంతో మంచినీటి కొరతను ఎదుర్కొంటున్నామని సిపిఎం ఒకటవ వార్డ్ మెంబర్ బోనంగి పుష్పవతి తెలిపారు. ప్రతిరోజు నీటి సరఫరా చేయలేదని, అధికారులకు పలుమార్లు చెబుతున్నా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వాపోయారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సక్రమంగా ప్రతిరోజు మంచినీటి సరఫరా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆందోళన చేపడుతున్న మహిళలు

కూలి కోసం వెళ్లి..విగతజీవులై..

- జి.రాగంపేటలోని అంబటి ఆయిల్ పరిశ్రమలో ప్రమాదం
- ఊపిరాడక ఐదుగురు అల్లూరి జిల్లా వాసులు మృతి
- పర్రెడ, బొండాపల్లి పంచాయతీల్లో విషాదఛాయలు



దిగాలుగా కుటుంబ సభ్యులు, పిల్లలు



రోధిస్తున్న కుటుంబీకులు

ప్రజాశక్తి - పెదబయలు :వారంతా గిరి పేదలు.. ఉపాధి కోసం పొట్టచేతపట్టుకుని వేరే జిల్లాకు ఈ మధ్యనే వెళ్లారు. పట్టుమని పది రోజులు గడవక ముందే వారిళ్లలో తీవ్ర విషాదం. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ కంపెనీకి చెందిన పరిశ్రమలో ఆయిల్ ట్యాంకర్ క్లీన్ చేయడానికి దిగి ఊపిరి ఆడక ఏడుగురు కార్మికులు గురువారం మృతిచెందగా వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా, పెదబయలు మండలానికి చెందిన వారే ఐదుగురు ఉన్నారు. దీంతో వారి స్వస్థలాలైన పర్రెడ, బొండాపల్లి ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల్లో వెచ్చంగి కృష్ణ (35), వెచ్చంగి నరసింహ (38), వెచ్చంగి సాగర్(20), కుర్తాడి బొంజుబాబు (26), కొర్ర రామారావు(43) ఉన్నారు. వీరిలో కృష్ణ, నరసింహ, సాగర్ ఒకే కుటుంబానికి చెందినవారు.

కూలి పనుల కోసం వెళ్లి..

పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం గ్రామం నుంచి వెచ్చంగి కృష్ణారావు, వెచ్చంగి నరసింహ, వెచ్చంగి సాగర్ ఇదే పంచాయతీలోని వంచెడిపుట్టు గ్రామ నివాసి కుర్తాడి బొంజుబాబు, బొండాపల్లి పంచాయతీ, ఈదులమెట్ట గ్రామ నివాసి కొర్ర రామారావు కూలి పనుల కోసం పది రోజులు క్రితం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటకు వెళ్లారు. అక్కడి ఆయిల్ కంపెనీలో పనికి కుదిరారు. ఇక ఎంతో కొంత కూలి డబ్బులు వస్తాయని, వాటితో జీవనం సాగించొచ్చని వారి కుటుంబీకులు అనుకున్నారు. ఇంతలోనే పెద్ద కుదుపు. ఫ్యాక్టరీలోని ఐదో నెంబరు ఆయిల్ ట్యాంకును శుభ్రం చేసేందుకు దిగి వారు ఊపిరాడక చనిపోయారన్న విషాద వార్త. దీంతో వారివారి స్వస్థలాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబీకులను గిరిజన, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు.



విలపిస్తున్న మహిళ

ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ

మృతుల్లో ఈదులమెట్ట గ్రామస్తుడు కొర్ర రామారావుకు భార్య, ఎనిమిది మంది సంతానం. వెచ్చంగి నరసింహకు భార్య, నలుగురు పిల్లలు, కృష్ణారావుకు భార్య ఐదుగురు సంతానం. వెచ్చంగి సాగర్‌కు ఇంకా వివాహం కాలేదు. మృతుల్లో కృష్ణ, నరసింహ, సాగర్ ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో ఆ కుటుంబీకుల రోధనలు మిన్నంటాయి. కృష్ణారావు కుమార్తె పవిత్ర విశాఖపట్నంలో నర్సింగ్ కోర్సు చదువుతోంది. ఆమెకు ఫీజు కట్టేందుకు డబ్బులు కూడబెట్టేందుకు కృష్ణారావు కూలి పనులకు వెళ్లినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మిగతా వారూ ఆర్థిక కష్టాల నుంచి బయటపడేందుకే వలసలు వెళ్లారు.

పలువురు పరామర్శ

మృతుల కుటుంబీకులను గిరిజన సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు, సిఐటియు మండల కార్యదర్శి కె.శరభన్న తదితరులు పరామర్శించారు. గిరిజనులు పండిస్తున్న వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర దక్కక పలువురు వలసలు పోతున్నారని, కొందరు అక్కడే తనువు చాలిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు.



బాధితులను పరామర్శిస్తున్న సన్నిబాబు, శరభన్న

మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలి

గిరిజన, ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి -పాడేరు: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలో ఆయిల్ ఫ్యాక్టరీలో ఏడుగురు కార్మికులు మృతి చెందడం పట్ల గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఆయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. పాడేరు గిరిజన సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇకనైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఫ్యాక్టరీలు, పని ప్రదేశాలలోను కార్మికులకు భద్రతా ఏర్పాట్లు చేసే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. .ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పి.లక్కు పాల్గొన్నారు.

పాడేరు:ప్రైవేట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పెదబయలు మండలం కు చెందిన ఐదుగురు గిరిజనుల కుటుంబాలకు తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.గిరిజన ప్రాంతాల నుండి వేలాది మంది కార్మికులు ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు వలస వెళ్లి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఉపాధి లేక వలస : సిపిఐ

పాడేరు: ఆదివాసి ప్రాంతంలో పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అనేకమంది గిరిజన రైతులు, నిరుద్యోగులు వలస పోతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సత్య నారాయణ గురువారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.


ఉద్యోగం ఇవ్వాలి: పృధ్విరాజ్

మృతుల కుంబాలకు ఉద్యోగం కల్పించి భూమిని ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి కొమ్మ పృథ్వీరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాన్ని వీడి ఎంతో మంది పొట్టకూటి కోసం వలసలు వెళుతున్నారన్నారు.

పట్టభద్రుల పోరు

-ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల -ఈ నెల 16న నోటిఫికేషన్
-23న నామినేషన్లు ప్రారంభం - 24న స్క్రూటినీ
-నామినేషన్ల ఉపసంహరణ గడువు 27
-మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
-అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
-ఉత్తరాంధ్ర బరిలో ప్రధాన రాజకీయ పార్టీలు
-పిడిఎఫ్ అభ్యర్థిగా డాక్టర్ కె.రమాప్రభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో:పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు ఉత్తరాంధ్రలో రసవత్తరంగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది. దీంతో ఎన్నికల కోడ్ మూడు ఉమ్మడి జిల్లాల్లో గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు (పాడేరు డివిజన్), అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 16న దీనికి సంబంధించిన నోటిఫికేషన్ వెలువడనుండగా 23న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. 24న నామినేషన్ల స్క్రూటినీ, 27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా నిర్ణయించారు. మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. మార్చి 16న కౌంటింగ్ ఉంటుంది.



ప్రచారంలో నిమగ్నమైన ఆయా పార్టీల అభ్యర్థులు

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రధానమైన రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంల్లో విశాఖ జిల్లా నుంచే ప్రధానంగా అభ్యర్థులంతా బరిలో ఉండడం విశేషం. వైసిపి అభ్యర్థిగా ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, తెలుగుదేశం అభ్యర్థిగా డాక్టర్ వేపాడ చిరంజీవిరావు బరిలో ఉన్నారు. 250 ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలోకి దిగారు. సిపిఎం ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తోంది. అధికార పార్టీ వైసిపి బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం అన్ని శక్తులనూ ఒడ్డుతుండగా, తెలుగుదేశం పార్టీ బలపరిచిన డాక్టర్ చిరంజీవిరావు పేరును అత్యంత ఆలస్యంగా ఆ పార్టీ వెల్లడించింది. విద్యావేత్తగా ఆయనకు మంచి పేరు ఉంది. బిజెపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ బరిలో ఉన్నారు. ప్రధానంగా అధికార వైసిపి అభ్యర్థిత్వంపైనా, బిజెపి సిట్టింగ్‌పైనా సొంత పార్టీల్లోనే వ్యతిరేకత పలు తరగతుల నుంచి వ్యక్తమవుతోంది. మాధవ్ గెలిచి ఉత్తరాంధ్రకు ఏ విషయంలోనూ న్యాయం చేయలేకపోయారన్న విమర్శలు నేటికీ వినిపిస్తూనే ఉన్నాయి. సొంత పార్టీలోనూ ఇదే వ్యక్తమవుతోంది. అధికార వైసిపి అభ్యర్థి సుధాకర్ ఓటర్ల చేర్పింపు నుంచి ఇప్పటి వరకూ ప్రలోభాలతో గట్టెక్కే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ వినియోగించుకుని గట్టెక్కాలని చూస్తున్నారు. దొంగ ఓటర్లను చేర్పించి లబ్ధిపొందాలని చూస్తున్నారంటూ పలువురి నుంచి ఆరోపణలను తరచూ ఎదుర్కొంటున్నారు. పలువురు అభ్యర్థులు ఇలా ప్రచారంలో పెద్ద ఎత్తున తమ తమ శైలిలో ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేపట్టారు.

ఆకట్టుకుంటున్న పిడిఎఫ్ అభ్యర్థి ప్రచార సరళి

ప్రోగ్రెసివ్ డెమొక్రటివ్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరపున నిలబడ్డ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలన్నిట్లోనూ సామాజిక కార్యకర్తగా పేరొందారు. పలు కార్యక్రమాలతో 30 ఏళ్లుగా అన్ని తరగతుల దృష్టినీ ఆకర్షిస్తూ వస్తున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో నిస్వార్థంగా, నిజాయితీగా, ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై కృషిచేస్తున్న తీరు, ఆమె సొంత కృషి ఈ ఎన్నికల్లో కలిసొచ్చే అంశంగా ఉంది. ఉత్తరాంధ్ర ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలపైనా, ఎపి విభజన తర్వాత ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయంపైనా ఆమె తరుచూ విశాఖ కేంద్రంగా తన గళాన్ని వినిపిస్తూ ఉండడం మరో ప్రత్యేకతగా ఉంది. రైల్వే జోన్ సాధన, పోలవరం, సుజల స్రవంతి రావాలని కోరుతూ పలు కార్యక్రమాల్లో ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఆ తరగతులకు మద్దతుగా నిలిచిన సందర్భాలు అనేకం. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం ప్రజల గొంతుకను చట్టసభల్లో వినిపించేందుకు ఉత్తరాంధ్ర విద్యావంతుల వద్ద 2023 శాసన మండలి ఎన్నికల్లో తన అదృష్టాన్ని ఆమె పరీక్షించుకోబోతున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఓటర్లు, బూత్‌ల వివరాలు

మొత్తం పోలింగ్ బూత్‌లు : 293
మొత్తం ఓట్లు: 2,83,751
మహిళలు: 1,48,025
పురుషులు: 1,78,796
ట్రాన్స్‌జెండర్స్: 40



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

ధాన్యం కొనుగోలు తక్షణం చేపట్టాలి

-సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ

ప్రజాశక్తి-విఆర్.పురం

రైతు నుంచి ధాన్యం కొనుగోలు తక్షణమే నిర్వహించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్ద మట్టపల్లి రైతు భరోసా కేంద్రంలో ధాన్యాన్ని గురువారం సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎండకు ఎండి, వానకు తడిసి, ఆరుగాలం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోగా, టార్గెట్ల పేరుతో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయకపోతే దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యాన్ని పశువులు, మేకలు, పందులు తింటున్నాయని, అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ పూనెం సరోజిని, రైతు సంఘం నాయకులు కారం సత్తిబాబు రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ర్యాలీ

ప్రజాశక్తి- చింతూరు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన చింతూరు బస్టాండ్ నుండి ఐటిడిఎ అంగన్వాడీలు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దేగలా మాధవరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎర్రం శెట్టి శ్రీనివాసరావు. గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, కుంజా సీతారామయ్య సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సున్నం రంగమ్మ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటి నుండి అంగన్వాడీ సెంటర్లలో ప్రవేశపెట్టిన ఫేస్ యాప్‌ను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 2 జిబి మొబైల్స్ ఇచ్చి, 8 జిబి పనులు ఎలా చేయడం సాధ్యమవుతుందని ప్రశ్నించారు. నెట్ సౌకర్యం కూడా కేంద్రాలు ఉన్నాయన్నారు. జాబ్ క్యాలెండర్ నిర్ణయించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సంపూర్ణ పోషణకు మెనూ ఛార్జీలు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్‌కు అర్హత ఉన్న ఆయాలకు, మినీ వర్కర్లుకు కచ్చితంగా పోస్ట్ ఇచ్చిన తర్వాతే ఖాళీలను భర్తీ చేయాలని, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని, పెండింగ్ జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, 2017 నుండి టిఎ డిఎ, ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ పేరుతోనూ, ఫుడ్ కమిషన్ వేధింపులు ఆపాలని, హెల్పర్లకు వయోపరిమితి లేకుండా అంగన్‌వాడీ వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, సహాయ కార్యదర్శి దిలీప్, ఈ నాలుగు మండలాల అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్లు సావిత్రి, రాజేశ్వరి, అన్నపూర్ణ, పార్వతి, వెంకటరమణ, దుర్గ, పెద్ద సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

3 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-కొయ్యూరు

ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నాటుసారా స్థావరాలపై కొయ్యూరు పోలీసులు గురువారం దాడులు నిర్వహించి 3,000 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. కొయ్యూరు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్సై రాజారావు, సిబ్బంది, ఏపీఎస్పీ, మహిళా పోలీసులతో కలిసి మండలంలోని రత్నంపేట గ్రామ శివారులో నాటు సారా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ దాడులు చేశారు. 3,000 లీటర్ల బెల్లం పులుపును, వంట సామాగ్రిని, డ్రమ్ములను ధ్వంసం చేశారు. అనంతరం ఆయా గ్రామాల గిరిజనులతో సమావేశమైన పోలీసులు నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నాటు సారా తయారీ, క్రయవిక్రయాలు చట్ట వ్యతిరేకమని, అటువంటి చర్యలకు పాల్పడితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించబడుతుందని సిఐ స్వామినాయుడు, ఎస్సై రాజారావు ప్రజలకు తెలిపారు.



పట్టుబడిన సాటు సారా తయారీ సామగ్రితో పోలీసులు

కొత్తూరుకోటలో ప్రత్యేక వైద్య శిబిరం

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి -సీలేరు

గిరిజనులు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి సోకిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకొని మెరుగైన వైద్యసేవలు పొందాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి హిమబిందు అన్నారు. జీకే వీధి మండలం కొత్తూరు కోట గ్రామంలో బుధవారం సాయంత్రం జ్వరాలతో బాధపడుతున్న మూడేళ్ల బాలిక పాంగితులసీకి ఆశా కార్యకర్తలు కిట్లు ద్వారా రక్త పరీక్షలు నిర్వహించగా మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. సమాచారం తెలుసుకున్న డాక్టర్ హిమబిందు గురువారం కొత్తూరు కోటలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది మాదిగ మల్లు గ్రామం వరకు వాహనంలో వెళ్లి అక్కడ నుంచి వాగులు దాటుకుంటూ కాలినడకన కొత్తూరుకోటకు చేరుకున్నారు. మలేరియా పాజిటివ్ వచ్చిన బాలిక కుటుంబ సభ్యులతో పాటు, గ్రామంలో ఉన్న గిరిజనులందరికీ వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ గ్రామంలో మలేరియా పాజిటివ్ కేసు నమోదైన బాలిక మినహా ఆదివాసీ గిరిజనులందరూ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. గిరిజనులు కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని, ప్రభుత్వం పంపిణీ చేసిన దోమతెరలను ప్రతి ఒక్కరూ ఉపయోగించాలని సూచించారు. గ్రామం మొత్తం ప్రతి ఇంటికి దోమల నివారణ మందుల్ని పిచికారి చేస్తామని తెలిపారు. ఎవరికైనా జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గుమ్మరేవుల గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 54 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ పోతురాజు, హెచ్ఎస్‌లు గోవిందు, అప్పారావు, ఏఎన్ఎంలు మత్స్య కొండ, సీత పాల్గొన్నారు.



చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హిమబిందు



ఆంధ్ర- ఒడిశా సరిహద్దు రహదారి వద్ద దట్టంగా కురుస్తున్న మంచు

దట్టంగా పొగ మంచు

- పెరిగిన చలి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం, సీలేరు పరిసర ప్రాంతాల్లో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 7, 8 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. దీంతో వాహన చోదకులు హెడ్ లైట్లు వేసుకొని టపయాణించవలసిన పరిస్థితి నెలకొంది. మంచు కారణంగా చలి తీవ్రత కూడా పెరిగింది. సాధారణంగా నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో మంచు తీవ్రత అధికంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తూ గజగజ వణికించే విధంగా చలి తీవ్రత ఉంటుంది. అయితే ఈ ఏడాది జనవరి నెల చివరిలో స్వల్పంగా మంచు కురుస్తూ తీవ్రత తగ్గు ముఖం పట్టింది. అయితే వారం రోజుల నుంచి మళ్లీ మంచు, చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది. పగటిపూట ఉష్ణోగ్రతలు కాస్త ఎక్కువగా ఉంటూనే రాత్రి అయ్యే సరికి ఒక్కసారిగా వాతావరణం మారి మంచు విపరీతంగా కురుస్తుంది. చలి తీవ్రత వల్ల గిరిజనులు, తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్ళే స్థానిక యువకులు ఇబ్బందులు గురవుతున్నారు. దారకొండ, దుప్పిలివాడ, కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ గ్రామాల్లో మంచు తీవ్రత అధికంగా ఉండడంతో గిరిజనులు చలిమంటలతతో ఉపశమనం పొందుతున్నారు.

ఆహ్లాదాన్నిస్తున్న మంచు అందాలు

సీలేరు పరిసర ప్రాంతాల్లో మంచు అందాలు సందర్శకులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. స్థానిక రెగ్యులేటరీ డ్యాం, మెయిన్ డ్యాం సమీప అటవీ ప్రాంతంలో మంచు తీవ్రత సుందర దృశ్యాలు గురువారం ఉదయం ఆవిష్కృతమయ్యాయి. ఆంధ్ర ఒడిశా సరిహద్దుల నుంచి తెల్లవారుజామున రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు ప్రకృతి అందాలు చూసి వారి సెల్‌ఫోన్లలో బంధించి ఎంతో అనుభూతిని పొందుతున్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ ఆదేశాల మేరకు ఏజెన్సీ వ్యాప్తంగా జిటిడబ్ల్యు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎడిఎంహెచ్ఒ కె.లీలాప్రసాద్ తెలిపారు. పాడేరు మండలంలోని మినుములూరు పిహెచ్‌సి పరిధిలోని శ్రీకృష్ణాపురం జిటిడబ్ల్యు ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం జిల్లా ఆసుపత్రి వైద్యులు, మినుములూరు పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. 603 మంది విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 32 మంది రక్తహీనత, చర్మ వ్యాధులు, దగ్గు, తక్కువ బరువు, కంటి చూపు, చెవి, దంత సమస్యలు వంటి తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నలుగురు విద్యార్థినిలకు తదుపరి వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు డివిజన్ లోని పిహెచ్‌సిల పరిధిలో పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అత్యవసర వైద్యం అవసరమైన వారిని గుర్తించి ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనుమానిత సికిల్ సెల్ అనీమియా కేసులను గుర్తించి తదుపరి పరీక్షలకు జిల్లా ఆసుపత్రికి పాడేరు తరలించి నిర్ధారణ పరీక్షలు జరిపించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య విద్యను విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి టి.విశ్వేశ్వరరావు, వైద్యాధికారి కె.బాబ్జీ, పాఠశాల హెచ్ఎం, సిబ్బంది, మినుములూరు పిహెచ్‌సి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



క్వశ్చన్ బ్యాంక్‌లను పంపిణీ చేస్తున్న కిల్లో సురేంద్ర

పదో తరగతి విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంక్స్ పంపిణీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : గిరిజన సంఘం విశాఖపట్నం సిటీ కమిటీ సహకారంతో మారికవలస గురుకుల బాలుర పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు మోడల్ క్వశ్చన్ బ్యాంక్స్‌ను గిరిజన సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కిల్లో సురేంద్ర గురువారం పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, 74 మంది 10వ తరగతి గిరిజన విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రచురితమైన ఈ పుస్తకం ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులు సాధించాలని కోరారు. పాడేరు ఐటిడిఎ గిరిజన సంక్షేమ హాస్టల్ 10వ తరగతి విద్యార్థులకు కూడా అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మోడల్ క్వశ్చన్ బ్యాంక్స్ ఉచితంగా అందించిన గిరిజన సంఘం విశాఖపట్నం సిటీ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సిటీ కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదర్ పాల్గొన్నారు.

కాఫీ రైతులకు బకాయిలు చెల్లించాలి

గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు



దుంబ్రిగుడలో ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

డుంబ్రిగుడ: కాఫీ రైతులకు బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల కాఫీ రైతులు గురువారం రంగిలిసింగిలో ఆందోళన చేపట్టారు. ఆ పంచాయతీ కింజేరిలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కాఫీ రైతుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు టి.సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, ఏజేన్సీ ప్రాంతంలోని 11 మండలాల పరిధిలో సుమారు లక్ష 30 వేల కుటుంబాలు కాఫీ సాగుపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. 2018 నుండి 2022 వరకు సుమారు 5200 ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్న 43247 మంది గిరిజన కాఫీరైతులకు బిల్లులు సుమారు రూ .60 కోట్లు ప్రభుత్వం బకాయి వుందన్నారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర, పార్చ్ మెంట్ కాఫీ కిలోకు రూ .500 కీల్లో చెర్రికాపీకి రూ .300, మిరియాలకు రూ వెయ్యి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17 న ఐటిడిఏలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి.డొంబు, పి.మోహన్ దాస్, కె.అర్జున్, పి దాస్, కాఫీ రైతులు పాల్గొన్నారు.

పాడేరు: జీకే విధి మండలంలోని నాగదేవత గుడిలో మండల స్థాయి కాఫీ రైతుల సదస్సు పాంగి బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, బిజెపి నాయకులు బుధవారం మీడియా సమావేశం నిర్వహించి హైడ్రో పవర్ ప్రాజెక్టు పై కేంద్రానికి ఎటువంటి సంబంధం లేదని కొన్ని రాజకీయ పార్టీలు కావాలని బురద జల్లుతున్నాయని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కొన్ని నెలలుగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధిత గ్రామాల గిరిజనులు పోరాటం చేస్తుంటే బిజెపి నాయకులు ఇప్పుడు గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుపై పర్యావరణ అనుమతులు ఎవరిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సంరక్షణ చట్టం పేరుతో అడవుల్ని ప్రైవేటు పరం చేయడానికి ప్రయత్నిస్తున్న ప్రభుత్వం ఏదో చెప్పాలన్నారు.విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. అల్లూరి జిల్లాలో 2018 నుండి 2021 గాను 47 వేల మంది కాఫీ రైతులకు కాఫీ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ముందుగా నాగదేవత గుడి నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి రెవెన్యూ అధికారులకు కాఫీ బకాయిలు చెల్లించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాలికొండ సిపిఎం ఎంపీటీసీ అప్పలరాణి బుజ్జిబాబు, గడుతూరి సత్యనారాయణ, ముర్ల వంతిబాబు, రామారావు, కాఫీ రైతు సంఘం కన్వీనర్ రఘునాథ్, పది పంచాయతీల నుంచి కాఫీ రైతులు తరలి వచ్చారు.

ముంచింగి పుట్టు: మండల కేంద్రంలో నిర్వహించిన కాఫీ రైతుల సదస్సులో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొమ పృథ్వీరాజ్ మాట్లాడుతూ, కాఫీ బకాయిలు చెల్లించడంలో ఐటిడిఎ పిఒ, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రోత్సాహకాలు అందక పోవడంతో ఎక్కువ మంది రైతులు భూములు ఖాళీగా ఉన్నాయన్నారు. కాఫీ రైతులకు నిచ్చెనలు, బేబీ పుల్ పింక్ యూనిట్స్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్లో కాఫీకి మంచి ధర ఉన్నప్పటికీ గిట్టుబాటు ధర చెల్లించలేదన్నారు. సాగులో ఉన్న అటవీ భూములకు పోడుపట్టాలు ఇచ్చి, మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. జీసీసీ ద్వారా రుణాలు ఇచ్చి, కాఫీ, మిరియాలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా కర్మాగా మండపం వద్ద నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నర్సయ్య, మండల అధ్యక్ష కార్యదర్శి లు నారాయణ, ఎంఎం శ్రీను, మండల వైస్ ఎంపీపీ 1 పాటు బోయి సత్యనారాయణ, కాఫీ రైతు సంఘం కన్వీనర్ గాసిరం దొర, జర్రెల వైస్ సర్పంచ్ వంతల గణపతి, శంకర్రావు, జీనబంధు, కాఫీ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు



సహాయక చర్యల్లో పాల్గొన్న శివప్రసాద్ తదితరులు

శివప్రసాద్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కాకినాడ జిల్లాలోని పెద్దాపురం మండలం జి.రాగంపేట ఫ్యాక్టరీలోని ఆయిల్ ట్యాంకర్‌లో దిగి ఏడుగురు కార్మికులు మృతి చెందిన ఘటన తెలిసిందే. మతుల్లో ఐదుగురు పాడేరు ఏజెన్సీ పెదబయలు మండలానికి చెందిన గిరిజనులు ఉన్నారన్న సమాచారం అందుకున్న నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అరకు ఎంపి గొడ్డేటి మాధవి భర్త శివప్రసాద్ హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిశీలించారు. సంఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. ఆ సమయంలో చేయాల్సిన సహాయ సహకారాలు అందించారు. అత్యంత దయనీయ స్థితిలో ఉన్న మృతదేహాలను అంబులెన్స్‌లో ఎక్కించి పోస్ట్ మార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శివప్రసాద్ మానవతా దృకృథాన్ని గిరిజనులు అభినందించారు.



జెఇఇ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

జెఇఇ మెయిన్స్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జెఇఇ మెయిన్స్ -2023 ఫేజ్ -1 ఫలితాల్లో గిరిజన విద్యార్థులు మెరుపులు మెరిపించారు. జెఇఇ మెయిన్స్ లో విశాఖపట్నం మారికవలస ఎపిటిడబ్యూఆర్ ట్రెనింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఐటిడిఎ అందిస్తున్న శిక్షణలను గిరి పుత్రులు సద్వినియోగం చేసుకుని మంచి పర్సంటైజ్ పొందారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన గిరిజన విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్ పరీక్షకు 18 మంది అర్హత సాధించారని ఒఎస్ డి డి.శివప్రసాద్ చెప్పారు. రాష్ట్రంలోని గిరిజన గురుకులాల్లో పాడేరు ఐటిడిఎ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన గిరిజన విద్యార్థులు ఉత్తమ పర్సంటైజ్ సాధించారని చెప్పారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ అందిస్తున్న ప్రోత్సాహాన్ని మారిక వలస గురుకులంలో శిక్షణ పొందున్న గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జెఇఇ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని చెప్పారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, బైజూస్ యాప్ సౌకర్యం కల్పించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, ఒఎస్‌డి డి.శివ ప్రసాద్ అభినందనలు తెలియ జేసారు. మెయిన్స్ ఫేజ్ -2లో మంచి పర్సంటైజ్ సాధించి ప్రతిష్టాత్మకమైన ఐఐటిలలో సీట్లు సాధించాలని ఆకాంక్షించారు.

మెయిన్స్ ఫేజ్ -2 పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులు

పి.రాహుల్ (85.5) పర్సంటైజ్, జె.వెంకట వరప్రసాద్ (70.87) వి.మనోజ్ కుమార్ (68.48), ఎం.జగపతి (52,72), జి.సంతోష్ (51.86). ప్రధాని మోహన్ (49.75). కి.మత్స్యాక్షి బన్ని (48.29). ఎం.లక్షాధిపతి రాజు (46.50), జి.చరణ్ (44.70), కె.రవిశంకర్ (44.50), ఎస్.దారసాయి (44.60), టి.లక్ష్మణ విక్రమ్ రాథోడ్ (41.53), జె.నాగ చైతన్య (41.09), జి.సదాశివ(40,96), పి.చినబాలాజీ (40.08), ఎస్.లక్ష్మిపతి శివాజీ (39.65), కె.రమేష్ (39.03), జి.సింహాద్రి (38.96) అర్హత పొందారు.

10న స్పందన రద్దు

ప్రజాశక్తి-పాడేరు: వైయస్సార్ కళ్యాణమస్తు కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా అల్లూరి జిల్లా లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి ఉన్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 10న శుక్రవారం స్పందన రద్దు చేయడం జరిగిందని సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు తెలిపారు. అర్జీదారులెవవ్వరూ స్పందన కార్యక్రమంకు రావద్దని జెసి విజ్ఞప్తి చేస్తారు.

గీతం, ఆంధ్రా యూనివర్సిటీ జట్ల ముందంజ

ప్రజాశక్తి -మధురవాడ : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) ఆధ్వర్యాన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల టార్గెట్ బాల్ పోటీలలో (పురుషుల) గురువారం ఆతిధ్య గీతం జట్టుతో పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్లు సత్తాను చాటాయి. పోటీలలో రెండవరోజు ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుపై 28-10 స్కోరుతో, జిఎల్‌యు జట్టుపై 25-7 స్కోరుతో వరస విజయాలు సాధించింది. గీతం విశ్వవిద్యాలయం జట్టు రాజస్థాన్ ఒపిజెఎస్ జట్టుపై 24-15 స్కోరుతో, ఐఐఎమ్ జట్టుపై 1-0 స్కోరుతో వరస విజయాలు నమోదు చేసింది. చెన్నై సవితా యూనివర్సిటీ జట్టుపై ఒపిజెఎస్ జట్టు 15-9 స్కోరు విజయం సాధించగా మరో పోటీలో టిఎస్‌పి విద్యాలయంపై జిఎల్‌ఎ యూనివర్సిటీ 17-4 స్కోరుతో విజయం సాధించాయి. గురువారం నాటి పోటీలను గీతం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, గీతం క్రీడా విభాగం డైరక్టర్ అరుణాకార్తీక్, డిప్యూటీ డైరక్టర్ శ్రీనివాస్ ప్రారంభించారు.

గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -మధురవాడ : స్థానిక వైఎస్ఆర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్మస్యలనడిగి తెలుసుకున్నారు. పలులు బ్లాకుల వద్ద డ్రెయినేజీ వ్యవస్థకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పోతిన హనుమంతరావు, పోతిన సురేష్, నూకవరపు బాబ్జి, వి.అప్పారావు, లోహిత్ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని పెద్ద మంటపల్లి పంచాయతీలో చర్చి వద్ద గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ఎంపీటీసీ ప్రదీప్ కుమార్, సర్పంచ్ సరోజినీ, ఫౌండేషన్ ఇన్చార్జి చేతుల మీదుగా ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ బయట హాస్పిటల్‌కు వెళ్తే చాలా డబ్బులు ఖర్చు అవుతుందని దృష్టిలో ఉంచుకొని అన్ని వ్యాధులకు ఇక్కడ వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ ప్రోత్సాహక నిధులు ఎప్పడిస్తారు ?

ప్రజాశక్తి-చింతూరు : పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన పంచాయతీలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహక నిధులు లచ్చిగూడెం పంచాయతీకి ఎప్పుడిస్తారని స్థానిక ఎంపిటిసి వేక రాజ్‌కుమార్ ప్రశ్నించారు. గురువారం లచ్చిగూడెంలో నిర్వహించిన గ్రామసభలో పంచాయతీ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి, వార్డు సభ్యులు, కొత్తూరు, వెంకటరాంపురం, లచ్చిగూడెం ప్రజలు పాల్గొన్నారు. ఏకగ్రీవమైన పంచాయతీకి రూ.5 లక్షలు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం వస్తాయని, ప్రస్తుతం పంచాయతీ ఖాతాల్లో నిధులు ఏ మేరకు ఉన్నాయని ప్రజలు అడిగారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహనిధులు ఇవ్వలేదని అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు జరిగి రెండేళ్లు కావస్తున్నా నేటికీ నిధులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇలా అయితే పంచాయతీ ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించామని గొప్పలు చెప్పుకోవడం తప్పా కనీసం గుంతల రోడ్లు, ఎండిపోయిన బోర్లు కూడా మరమ్మతులు చేయడం లేదని విమర్శించారు. గ్రామపంచాయతీ నిధులతోనైనా చేతి పంపులు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వే డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి గురువారం విశాఖపట్నం పోర్టు రైల్వే సైడింగ్‌ను ఉన్నత స్థాయి అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. ఓడరేవులోని బొగ్గు అన్‌లోడింగ్ సైడింగ్, కోల్ లోడింగ్ పాయింట్, కవర్ షెడ్ ఇతర ముఖ్యమైన ప్రదేశాలను బృందం పరిశీలించింది. అనంతరం వైజాగ్ పోర్టు చైర్మన్ రామ్మోహనరావుతో డిఆర్ఎం సమావేశమయ్యారు. పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రేక్ డిటెన్షన్, సామర్థ్యాన్ని మెరుగుపరచడం, త్రూపుట్ మొదలైన సమస్యలను పరిష్కరించడానికి కలిసి పని చేస్తామని డిఆర్ఎం హామీ ఇచ్చారు.

రైల్వే మంత్రితో ఎంపీ ఎంవివి భేటీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఢిల్లీలోని రైల్ భవన్‌లో గురువారం భేటీ అయ్యారు. విశాఖపట్నం నుంచి తమిళనాడుకు వారాంతంగా నడిచే 12665/12666 హౌరా - కన్యాకుమారి, 12663/12664 హౌరా - తిరుచిరాపల్లి, 20896/20895 రైళ్లను ప్రతి రోజూ నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని, విశాఖపట్నం - ట్యూటికోరన్, విశాఖపట్నం - కన్యాకుమారి, విశాఖపట్నం - వేలంగిని మధ్య నూతన రైళ్లను ప్రారంభించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే ఏజెంట్‌గా వ్యవహరించొద్దు

బిజెపి ఎంపీ జివిఎల్.నరసింహారావుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం హెచ్చరిక



మాట్లాడుతున్న లోకనాథం, చిత్రంలో జగ్గునాయుడు, కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సొంత నిధులతో, పలువురి త్యాగాలతో, కార్మిక శక్తితో విస్తరించి లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు పన్నులు చెల్లిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌వారికి కట్టేబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత దారుణమైనదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు ఏజెంట్‌గా వ్యవహరించొద్దని బిజెపి ఎంపీ జివిఎల్.నరసింహా రావును హెచ్చరించారు. ఇప్పటికైనా ఆయన తీరు మార్చుకోవాలని అన్నారు. గురువారం ఉదయం మద్దిలపాలెంలోని సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లోకనాథం మాట్లాడారు. విశాఖపట్నం, ఉత్తరాంధ్ర ప్రజల పట్ల జివిఎల్.నరసింహారావు అమితమైన ప్రేమ ఉన్నట్లుగా నటించడం సరికాదన్నారు. ప్లాంట్ నిర్వీర్యమే లక్ష్యంగా ఆయన పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించడం కోసం ఏనాడూ ప్రయత్నం చేయలేదన్నారు. విశాఖకు మెట్రో రైలు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు, రైల్వేజోన్ నిధులు, ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ నిధులు వంటి అంశాలు అనేకం ఉన్నప్పటికీ జివిఎల్ ఏనాడూ ఆ దిశగా ప్రయత్నం చేయలేదన్నారు. బిజెపి స్థానిక నాయకులు, ఎమ్మెల్సీ మాధవ్‌తో సహా కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలను మరింత బలపర్చే విధంగా, వాటిని అమలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. కేవలం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నష్టాల పేరు చెబుతున్నారని, నష్టాలకు కారణం సొంత గనులు కేటాయించకపోవడం అన్న విషయాన్ని విస్మరిస్తున్నారని తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు చేసినప్పుడు కేంద్రం పెట్టుబడి కింద కేవలం రూ.5 వేలు కోట్లు పెడితే స్టీల్‌ప్లాంట్ ఇప్పటి వరకూ రూ.52 వేల కోట్లును కేంద్రానికి పన్నుల రూపంలో చెల్లించదన్న వాస్తవాన్ని దాచిపెడుతున్నారన్నారు. నేడు పాలకులు అదానీ సేవలో ఉండి గంగవరం పోర్టుతో సహా రాష్ట్రంలో ఉండే అన్ని సహజ వనరులనూ అతనికే కట్టబెడుతున్నారని తెలిపారు. బుధవారం విశాఖలో జివిఎల్ ప్రెస్‌మీట్ పెట్టి స్టీల్‌ప్లాంట్ కోసం ప్రేమ చూపిస్తూనే.. హెచ్‌బి కాలనీలో ఉన్న 20 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి నష్టాలను పూడ్చుకోవాలని చెప్పడం సరైందికాదు. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలను రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు కేవలం 6 వేల కోట్లు ఇవ్వడానికి ఎందుకు వెనుకడుగు వేస్తుందని ప్రశ్నించారు. జివిఎల్.నరసింహారావు ఉత్తరాంధ్రకు నష్టం చేకూర్చే ఏజెంటుగా వ్యవహరిస్తే విశాఖలో అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొన్నారు.

ఎగుమతి, దిగుమతులపై కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో సూర్యాబాగ్ టివిఎంసిఎ సమావేశ మందిరంలో ఎగుమతి, దిగుమతుల నిర్వహణపై ఐదు రోజుల సర్టిఫికెట్ కోర్సును గురువారం ప్రారంభించారు. ఎగుమతి, దిగుమతులకు భారత ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు చాలా ప్రశంసనీయంగా ఉన్నాయని ఫ్యాప్సీ ప్రెసిడెంట్ కరుణేంద్ర ఎస్.జాస్తి అన్నారు. అనంతరం ఎగుమతులకు సంబంధించిన కార్యక్రమాల సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఫ్యాప్సీ చేస్తున్న కృషిని ఇసిజిసి లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ అమ్లెందు బిపుల్ మిశ్రా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి పాల్గొన్నారు.

11 నుంచి మానవత - నైతికతపై ప్రచారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మానవత - నైతికత అనే కార్యక్రమాన్ని ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ విశాఖ జిల్లా నాయకులు జనాబ్ షేక్ మక్బూల్ తెలిపారు. గురువారం మహారాణిపేటలోని ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సాగుతుందన్నారు. ఇదొక జాగృతి ఉద్యమమని పేర్కొన్నారు. నేడు మనిషి వైజ్ఞానిక అభివృద్ధిలో దూసుకుపోతున్నాడని, కానీ మానవతా విలువలు నానాటికీ దిగజారుతున్నాయని తెలిపారు. సమాజం నిత్యం అశాంతికి, అలజడికి గురవుతోందని, అందుకు సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, మారణహోమాలే కారణమని అన్నారు. ఈ నేపథ్యంలో మనిషిలో నైతిక పరివర్తన కలిగినపుడే మానవతా విలువలు వికసిస్తాయని తెలిపారు. అనంతరం విశాఖ ఈస్ట్ సిటీ అధ్యక్షులు జనాబ్ జియా అలీఖాన్, వెస్ట్ సిటీ అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ ఇబ్రహీం మాట్లాడారు. కార్యక్రమంలో జనాబ్ షేక్ సిరాజ్, రహమతుల్లా, బషీరుద్దీన్, డాక్టర్ యాసీన్ ఖాన్, హమీద్ బాషా, వాషిక్ రజ, అబ్దుల్ సలాం, అహ్మద్, షేక్ బాజీ బాబా పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



నూతన వధూవరులతో సత్యనారాయణ దంపతులు

అనాథ ఆడపిల్లకు పెళ్లి చేసిన దంపతులు

ప్రజాశక్తి -సీలేరు : తల్లిదండ్రులను కోల్పోయిన ఆడపిల్లకు అన్ని తానై పెళ్లి చేసిన రెవెన్యూ ఉద్యోగి సత్యనారాయణ దంపతులను సీలేరు ప్రాంత ప్రజలు ప్రశంసించారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బూసికొండ గ్రామానికి చెందిన బాబురావు రాములమ్మ దంపతులు 2015లో ఆరు నెలల వ్యవధిలోనే మృత్యువాత పడ్డారు. దీంతో వారి నలుగురు పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయాన్ని అప్పట్లో పత్రికల్లో ప్రచురించడంతో రెవెన్యూ ఉద్యోగి సత్యనారాయణ దంపతులు స్పందించారు. నలుగురు చిన్నారులు ఆలనా పాలన సత్యనారాయణ చూసేవారు. ఈ క్రమంలోనే వీరిలో పెద్ద కుమార్తె మరిగెల స్వాతికి గురువారం సీలేరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణ దంపతులు తల్లిదండ్రులుగా వ్యవహరించి వివాహం జరిపించారు. వరుడు శంఖం రాంబాబు కాళ్లను కడిగి కన్యాదానం సత్యనారాయణ దంపతులకు చేశారు. సత్యనారాయణ దంపతులు నలుగురు అనాథలకు సంరక్షిస్తూ అందులో పెద్ద అమ్మాయి స్వాతి వివాహం చేసి ఆయన మానవత్వాన్ని మరొకసారి చాటుకున్నారని సీలేరు వాసులు ప్రశంసలు వర్షం కురిపించారు.



గుంతలను పూడ్చుతున్న సిబ్బంది

'రంగు రాళ్ల' గొయ్యిలు పూడ్చివేత

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బాలరేవుల గ్రామ శివారులో ఉన్న కొండపై రంగు రాళ్ల కోసం తవ్విన గొయ్యిలను మంప ఎస్సై లోకేష్ కుమార్, సిబ్బంది, ఫారెస్టు అధికారులు గురువారం పూడ్చివేత చర్యలు చేపట్టారు. గొయ్యిలను గాజు పెంకులు, కంకర మట్టితో పూడ్చారు. ఎవరైనా రంగురాళ్ల కోసం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సింహాద్రి, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ప్రసాద్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాకేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణతో ఉపాధికి దెబ్బ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉన్నందునే ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, బిసిలతో పాటు అన్ని తరగతుల వారికీ ఉద్యోగాలు లభించాయని సిఐటియు మల్కాపురం జోన్ కార్యదర్శి పూడి పైడిరాజు అన్నారు. ఇదే కర్మాగారం ప్రైవేట్ కార్పొరేట్ చేతుల్లోకి వెళితే రిజర్వేషన్లు ఉండవని, అదే జరిగితే అన్ని సామాజిక తరగతుల వారికీ ఉపాధి దొరకదని అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 679వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికిపైగా ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అమ్మివేయాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు.